


కుందేళ్లకెందుకులే! మా యింట్లో మట్టుకు అటు వంటి బలవంతమేమీ లేదు.'' అంది శారద.

''అదృష్టవంతురాలివి. నీకా తలనొప్పి తప్పింది.'' అంది రాజేశ్వరి.

ఆనాటి వారి సంభాషణ అలా సాగింది.

ఐతే అప్పుడు వంటింటి కుందేలుకి చదువేంటి అని వాదించిన శారద హఠాత్తుగా యిలా పుస్తకం పట్టడంలోని ఆంతర్యమేమిటి?

కాలానికున్న బలం చాలా గొప్పది. ఆ కాలం అనుకూలిస్తే రాజయోగాన్నే కలిగిస్తుంది. ఎదురు తిరిగితే మనతో గారడీలెన్నో చేయిస్తుంది. అది సక్రమంగా వెళితే సుఖం, వక్రిస్తే విషాదం. నూరు పూవులూ ఆరుకాయలుగా సాగిన రాజేశ్వరి సంసారం విధివిసిరిన రాయికి ఉన్నపాటున వెన్నువిరిగి పడుతుందని కలగన్నదెవరు?

అది ఏకనాథం పాలిట మృత్యురాత్రి.

తొమ్మిది దాటిపోయింది. పిల్లలు తిళ్లుతిని కునుకుపాట్లు పడుతున్నారు. ఎనిమిదికి రావలసిన భర్త ఎందువల్ల రాలేదు చెప్మా అనుకుంటూ ఎదురు తెన్నులు చూస్తూ ఉంది రాజేశ్వరి. ఆ రోజుదయం మొదలయిన ముసురు మూడు రోజులుండి పోతానంటూ వెదర్ రిపోర్టరుకి మొరపెట్టుకుంది. రాజేశ్వరి వరండాలో నిలబడి వర్షాన్ని తిడుతూ భర్తకోసం చూస్తున్నది. ఎక్కడో పడ్డ పిడుగు శబ్దం గుండె దడదడ లాడించింది. ఆ పిడుగుతో పోటీపడుతూ వచ్చిన వార్త రాజేశ్వరిని నిలువునా కూల్చివేసింది. ఏకనాథంని లారీ మట్టేసిందన్న దుర్వార్త కాలనీని శోక సముద్రంలో ముంచేసింది.

కాలనీ అప్పుడు అస్తమించాడు. మామయ్య మరిలేడు. అన్నయ్య చనిపోయాడు. రాజేశ్వరిని విధి వెన్నుపోటు పొడిచింది. పిల్లలు అన్యాయమయిపోయారు. రాజేశ్వరి దాదాపు పిచ్చిదే అయింది.

కొన్నాళ్ల తర్వాత విఘాతం నుండి కొంత కోలుకున్న రాజేశ్వరికి ఎదురయిన మొదటి ప్రశ్న—

పిల్లలతో ఎలా బతకాలి?

దానికి సమాధానంగా 'యాజమాన్యం బతుకు తెరువు చూపాలన్నారు' ఆప్తులు.

యాజమాన్యం అందుకు అభ్యంతరం చెప్పలేదు. కాని అడిగింది. ఒక ఇన్స్పెక్టరు భార్యగా ఆమెను ఆఫీసులోనే ఎంగేజ్ చెయ్యాలి. మరి ఆమె విద్యార్హతేమిటి?'

భర్తచేసిన ప్రయత్నం, తన అశ్రద్ధా కళ్లముందు కదలాడాయి. ఆమె తల సిగ్గుతో వాలిపోయింది. చివరకు ఆమె చెయ్యగల ఉద్యోగం స్వయంగానే ఎన్నుకోమని జాబితాను ముందుంచింది.

తనకున్న క్వాలిఫికేషన్ని దృష్టిలో ఉంచుకొని ఉద్యోగ జాబితాను శోధిస్తే, తనకు తగ్గవాటిలో మేలుగా కనిపించిన పోస్టు — అటెండెంటు. ఒక ఇన్స్పెక్టరు భార్య అటెండెంటుగానా? అనుకున్నారు ఆప్తులు. అంగీకరించక మరో మార్గం తోచరలేదు రాజేశ్వరికి.

శారదలోని శారద మేల్కొనేందుక్కారణం రాజేశ్వరికి జరిగిన ఘోరమూ దానివల్ల ఎదురయిన సమస్యాను. ముందు కాలంలో కాలం తనకేదయినా అన్యాయం తలపెడితే తట్టుకునేందుకు సాగిస్తున్న సన్నాహమే ఇది.

*